

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్



**రైల్లో ప్రయాణిస్తుండగా** ఒకామె రామాయణం పుస్తకం చదువుతూండడం, దేవుడ్ని నమ్మని ఓ నాస్తికుడు చూశాడు.

"ఎక్స్‌క్యూజ్ మి..మీరు అందులో చెప్పిన సోదంతా నమ్ముతున్నారా?" అడిగాడు ఆమెని.

"నమ్ముతాను. ఇది హైందవుల ఆరాధ్యగ్రంథం కదా" చెప్పిందామె.

"కోతిలాంటి మనిషి ఎక్కడైనా ఉంటాడా? వున్నా మాట్లాడగలడా? సముద్రాన్ని లంఘించగలడా? ఇదంతా నమ్ముతారా?"

"ఆంజనేయస్వామి గురించా మీరు చెప్పేది? నమ్ముతాను"

"కోతి మనిషిగా ఎలా ప్రవర్తించగలడు? లేదా మనిషికి కోతిలా తోక ఎలా ఉంటుంది?" ప్రశ్నించాడతను.

"నాకు నిజంగా తెలీదు. నేను స్వర్గానికి వెళ్ళాక ఆయన్నే అడిగి తెలుసుకుంటాను" చెప్పిందామె.

"ఒకవేళ ఆంజనేయుడు స్వర్గంలో లేకపోతే?" అడిగాడతను వెటకారంగా నవ్వుతూ.

"నరకంలో ఉంటే మీరే ఆయన్ని అడగచ్చు" నవ్వుతూ చెప్పిందామె.

★★★

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"ఈ థర్మామీటర్ మీ ఆవిడ నోట్లో ఉంచి రెండు నిముషాలు నోరుమూసి ఉంచమని చెప్పండి" అన్నాడు డాక్టర్.

"దయచేసి అరగంట మాట్లాడకుండా ఉంచే థర్మా మీటరేదయినా ఉంటే యివ్వండి సార్" అర్థించాడు ఆ అభాగ్యుడు.

❦❦❦

"డాక్టర్‌గారూ! మీ క్లినిక్ మేడపైకి మార్చిన తరువాత రోగులు ఎందుకు తగ్గిపోయారో నాకిప్పుడు అర్థమయ్యింది"

"ఎందుకని?"

"మెట్లవద్దనున్న 'పైకిపోవడానికి దారి ' అనే ఆ బోర్డువల్ల"

❦❦❦

నీటి శుభ్రత గురించి సైనికులకు వివరించడానికి వచ్చాడో డాక్టర్. ఓ సార్జంట్‌ను పిలిచి "నీరు శుభ్రంగా ఉండాలంటే నీవేం చేస్తావో చెప్పు" అన్నాడు డాక్టర్.

"ముందు నీటిని బాగా మరిగిస్తాను"

"వెరీగుడ్"

"ఆ తరువాత నీటిని చల్లార్చి వడగొడతాను"

"వెరీనైస్. తర్వాత?"

"ఆ నీటితో కాళ్ళు కడుక్కొంటాను"

❦❦❦

"సార్! నాకు బెదిరింపు ఉత్తరాలొస్తున్నాయి ఈ మధ్య" పోస్టు మాస్టర్‌తో మొరపెట్టుకున్నాడో పెద్దమనిషి.
"అలాగా! ఉత్తరాలద్వారా బెదిరించడం చట్టవిరుద్ధం. ఆ ఉత్తరాలెవరు రాస్తున్నారని మీ అనుమానం?"
"అనుమానం ఏముంది? ఇన్‌కంటాక్స్ వాళ్ళ ఆఫీసునుండే వస్తున్నాయి ఆ ఉత్తరాలు"

ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ తీసుకుని రైలెక్కడానికి వచ్చాడు పుల్లారావ్. స్టేషన్‌లో బరువు చూపించే యంత్రంలో చిల్లర వేశాక బయటకొచ్చిన కార్డులో యిలావుంది –
"మీరు ఈ రోజు చేసిన పనివల్ల త్వరలోనే మీ కుటుంబానికి ధనయోగం రాబోతోంది"

"మేడం! మీరు పడిపోకుండా ఉండేందుకు ఏమయినా సాయం చేయమంటారా?" బస్సులో ప్రయాణిస్తున్న కోమలిని అడిగాడు సుబ్బారావ్.
"మరేం ఫర్లేదు. రాడ్‌కున్న బెల్ట్‌లను పట్టుకునే నిల్చున్నాను. పడిపోనులే" కోపంగా చూస్తూ అంది కోమలి.
"మీరు పడిపోతారని నేనేం బాధపడటంలేదు. నా బాధల్లా కొత్తగా కొన్న నా టై మీ చేతుల్లో అలా నలిగిపోతోందే అని."

"'నేనిచ్చిన పుస్తకం'పిల్లల అల్లరి అదుపు చేయటం ఎలా?' చదివావా?" మిత్రురాల్ని అడిగింది సులక్షణ.
"దానివల్ల ఇప్పుడు మావాడి అల్లరి చాలావరకూ తగ్గిందిలే"
"వెరీగుడ్. చాలా మంచి పుస్తకం సుమా అది"

"అవును. వాడల్లరి చేసినప్పుడల్లా ఆ పుస్తంతో నెత్తిమీద ఓ దెబ్బ వేయగానే సైలెంటయిపోతున్నాడు"

మొన్న నేనొక హోటల్లో భోజనం చేశాక అక్కడి సర్వర్ వచ్చి నేను చేతులు కడుక్కోగానే గోడనున్న కోటు తీసి స్వయంగా తొడిగాడు. వాడికి ఐదు రూపాయల టిప్ యిచ్చాను గొప్పగా చెప్పాడు సర్వేశం.

"అంతమాత్రానికే ఐదు రూపాయల టిప్పెందుకిచ్చావ్?" నొచ్చుకుంటూ అడిగాడు మిత్రుడు మల్లేశం.

"పరాయివాళ్ళ కోటు పైసా లేకుండా ఉత్తపుణ్యానికి తీసుకోవడం ఏం మర్యాద."

"ఏమయ్యా! ఇది పుస్తకాల దుకాణమా లేక చిత్తు కాగితాల షాపా?"

"చిత్తం తమరు లోనికి దయచేయక ముందుమాత్రం పుస్తకాల షాపుగానే ఉండేదండీ"

"ఏరా! నువ్వెప్పుడయినా స్కూల్లో ఫస్టొచ్చావా?" రామూని దగ్గరకు తీసుకుంటూ అడిగాడో దూరపు బంధువు.

"గంటకొట్టగానే స్కూలు బయటకొచ్చే విద్యార్థుల్లో నేనే ఫస్టొస్తుంటాను" గర్వంగా చెప్పాడు రాము.

COMMENTS